# మమ్మీ ! యూఆర్ గ్రేట్ !!

ఇంటి ముందు కారాగిన శబ్దం విని కిటికీలోంచి బయటకు చూసింది శారద.

కారులోంచి కిందకు దిగిన అపర్ణ డ్రైవింగ్ సీటులో కూర్చున్న వ్యక్తితో అంటోంది-

"థాంక్యూ, సార్ ! మీకు శ్రమ కలిగించాను !"

"నో... నాటెటాల్ ! నీలాంటి బ్యూటీకి లిఫ్ట్ ఇవ్వటంవల్ల ఈ కారు విలువ మరింత పెరిగింది...యూ నో ?"

ఆ మాటల్ని వినగలిగిందే కానీ, ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తిని స్పష్టంగా చూడలేక పోయింది శారద.

"రేపు సాయంత్రం... మరచిపోవుగా !" అంటూ అతను తన చేతిని బయటకు చాపాడు.

"బలేవారే !...మీరే స్వయంగా ఆహ్వానిస్తే మరిచిపోగలనా !" తన అరచేతిని అతని చేతికి అందించి చెప్పింది అపర్ణ.

ఇప్పుడు అతని చెయ్యి స్పష్టంగా కనిపించింది. బలిష్ఠమైన ఆ చేతిపై ఒత్తుగా వెంట్రుకలు... మణికట్టు మీదనించి కిందకు వేలాడుతున్న బంగారు గొలుసు...వేళ్ళకు రెండు ఉంగరాలు !

'సంజీవి కాదుకదా ?' అనుకుంది శారద.

ఆ ఆలోచన కలగగానే క్షణం సేపు ఊపిరి తీసుకోవటం మరచిపోయిందామె. ఆ చేతివైపు అలాగే చూస్తూ అచేతనంగా నిలబడిపోయింది.

"థాంక్స్ ఎ లాట్ !" అంటూ అతను అపర్ణ చేతిని దగ్గరకు తీసుకుని నెమ్మదిగా వంగి ఆ చేతిపై ముద్దు పెట్టుకున్నాడు.

ఇప్పుడు అతణ్ణి చూడగలిగింది శారద.

అతనే ..! సంజీవి !...

తన ఊహ నిజమైంది !

"హాయ్...మమ్మీ !" లోపలకు వచ్చిన అపర్ణ, వెనుకగా నిలబడి తన భుజాలు

కుదుపుతూ పలకరించటంతో శారద వాస్తవానికి వచ్చింది.

"ఆ కార్లో ఎవరు ?" అపర్ణ చేతుల్ని విసురుగా తోసేస్తూ విసురుగానే అడిగింది.

"మా కంపెనీ ప్రొప్రయిటర్ సంజీవరావ్‌గారమ్మా! స్టేట్స్‌నించి ఈ మధ్యే వచ్చారు. ఆయన ఆశువుగా కవిత్వం బలే చెప్పేస్తారు మమ్మీ !" ఉత్సాహంగా చెప్పింది.

"పెళ్ళయిందా ఆయనకి ?" తన కళ్ళలో భావాలు కూతురుకి కనిపించనీయకుండా జాగ్రత్తపడుతూ అడిగింది శారద.

ఆ ప్రశ్న విన్న అపర్ణ పకాలున నవ్వింది.

"సరిగ్గా ఇదే ప్రశ్న ఇంతకుముందే కార్లో ఆయన్ని అడిగాను మమ్మీ... దానికి ఆయన చెప్పిన సమాధానం విన్న తర్వాతనే ఆయన గారి కవితా ధోరణి నా కర్థమయింది !" నవ్వుతూనే చెప్పింది.

చిరాగ్గా చూసింది శారద.

"పెళ్ళి అనే బంధంతో ఆనందానికి ఉరిశిక్ష వేసి, కోరికల్ని హత్య చేయటం నా కిష్టం లేదు. జీవితంలో ఆనందాన్ని అందంగా ఆస్వాదించటానికి పెళ్ళే అవసరంలేదు. 'కులాసా' అనే గ్లాసులో 'సరదా' అనే డ్రింకు పోసి, ఖుషీ అనే మత్తును ఎప్పుడూ నరాల్లో నింపుకుంటే, అప్పుడీ జగత్తంతా ఆ మత్తులో గమ్మత్తుగా చిత్తైపోయి... అంటూ బలే తమాషాగా మాట్లాడేరు, మమ్మీ" చెప్పింది అపర్ణ.

"ఊ!...చాల్లే...రోడ్డుమీద, ఆయన్తో ఆ కబుర్లేమిటి?....నువ్వింకా కాన్వెంటు బేబీ ననుకుంటున్నావా?.... చుట్టుపక్కలవాళ్ళు ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?..."

అపర్ణ మనసు చివుక్కుమంది.

"నేనేం తప్పుగా ప్రవర్తించలేదు, మమ్మీ!" అంది తల వంచుకుని.

"సారీ బేబీ... నా ఉద్దేశం అది కాదు!"

"పోన్లే మమ్మీ! ఆ టాపిక్ వదిలేయ్...ఉండు... మనిద్దరికీ కాఫీ కలిపి తీసుకొస్తాను!" అంటూ పైటచెంగుని నడుం చుట్టూ బిగించి వంటింట్లోకి వెళ్ళింది అపర్ణ.

'నేను అపర్ణను నొప్పించలేదుకదా?' టీపాయ్ మీద ఉన్న ఊలు బంతినీ, సూదుల్నీ చేతిలోకి తీసుకుని సోఫాలో కూర్చుంటూ అనుకుంది శారద.

అసలు కారులో వచ్చిన వ్యక్తి సంజీవి కాకుండా మరొకరు ఎవరైనా అయ్యుంటే తాను ఇంతగా కలవరపడి ఉండేది కాదు...

అప్పటికీ, ఇప్పటికీ సంజీవిలో ఎలాంటి మార్పూ రాలేదు.. కొంచెం బట్టతల అయినట్టుగా కనిపించింది. చెంపల దగ్గర వంకీల జుట్టు మాత్రం తెల్లబడింది. ఎందుకో అప్పటికంటే ఇప్పుడు మరింత హుందాగా ఉన్నట్టు అనిపించాడు.

అప్పుడు......!

అంటే దాదాపు ఇరవై సంవత్సరాల క్రితంనాటి మాట....!

ఒకరోజు తను మేనేజరు దగ్గర 'డిక్టేషన్' తీసుకుంటోంది. అంతలో మత్తైన పరిమళం ఒక్కసారిగా ఆగదిలో గుప్పుమంది. మైమరపుగా పక్కకు తిరిగి చూసింది తను.

తెల్లటి సూటులో అందమైన అరనవ్వును పెదాలపై అద్దుకుని అతను లోపలికి వచ్చాడు.

తనకు లెటర్ 'డిక్టేట్' చేస్తున్న మేనేజరు హఠాత్తుగా లేచి నిలబడ్డాడు.

"వెల్‌కమ్, సర్!" అంటూ ముందుకు వెళ్లి అతనికి షేక్‌హేండ్ ఇచ్చి ఆహ్వానించాడు.

అతని వైపే కన్నార్పకుండా అలాగే చూస్తూండిపోయింది తను. మగవాళ్ళలో అతనంతటి అందగాళ్ళను తనెప్పుడూ చూడలేదు.

"యు కెన్ గో! లెటర్ తర్వాత చెప్తాను!" అన్నాడు మేనేజరు.

అతి కష్టంమీద తన చూపుల్ని అతనిపై నించి మరల్చుకుంటూ లేచి నిలబడి, తడబడే అడుగులతో మేనేజర్ గదిలోంచి బయటకు వచ్చేసింది.

వచ్చేస్తున్న తనవైపు రెప్పార్పకుండా చూశాడతను.

దాదాపు పదేళ్ళపాటు పెరిగి పెద్దదై, అప్పుడప్పుడే అణగారిపోతున్న ఆమెలోని 'తీపి కోరిక' కు ఆ చూపులు సూటిగా గుచ్చుకున్నాయి.

మరొక్కసారి మళ్ళీ అతణ్ణి చూడాలనిపించింది తనకు.

అదృష్టవశాత్తూ తన పెన్సిల్ మేనేజర్ గదిలో మరచిపోయిన సంగతి చటుక్కున గుర్తుకొచ్చింది.

దాన్ని తెచ్చుకునేందుకు తిరిగి ఆ గదిలోకి వెళ్ళబోతూ, లోపల్నించి వినవస్తున్న మాటలువింటూ అప్రయత్నంగా ఆగిపోయింది.

"ఎవరా కోకిలా ?"

"శారద అనీ ...మా స్టెనో !...వెరీ 'బ్రిలియంట్' లేడీ !" మేనేజర్ చెప్పాడు.

"ఆడ స్టెనోలు 'బ్రిలియంట్'గా ఉన్నా, లేకపోయినా బ్యూటిఫుల్‌గా మాత్రం ఉండి

తీరాలి !...అది రూలు !" అతను నవ్వుతూంటే మేనేజర్ కూడా శ్రుతి కలిపాడు.

అతని మాటలూ, దాన్ని అంటిపెట్టుకున్న వెకిలి నవ్వులూ విన్న తర్వాత తన అడుగు మరి ముందుకు పడలేదు. గది లోపలకు వెళ్ళాలనే ప్రయత్నాన్ని విరమించుకుని వెనక్కి వచ్చి సీట్లో కూలబడిపోయింది.

భగవంతుడు తనకు ఆడజన్మను ప్రసాదించాడు. తనలో చురుకుతనాన్నీ, తెలివితేటల్నీ రంగరించి పోశాడు. వయస్సుకు తగ్గ ఒంపుసొంపుల్ని అందించాడు. వాటికి ఆకలి కూడా నేర్పించాడు. అన్నింటితోబాటు 'అనాకారితనాన్ని' మాత్రం శాపంగా అనుగ్రహించాడు....నిజమే.....తనకంటే కోకిలే తెల్లగా ఉంటుందేమో! తనను చూసి కన్నతల్లి కూడా పాలివ్వటానికి అసహ్యించుకునేది...చిన్నతనంలో ఏమీ తెలియక పైకి ఏడిస్తే- అన్నీ తెలిసిన తర్వాత ఇప్పుడు లోలోపలే కుమిలి కుమిలి ఏడుస్తోంది....

నాన్న ఎన్ని సంబంధాలు తెచ్చినా ఎవరికీ తను నచ్చకుండా, పెళ్ళికాని కన్యగానే మిగిలిపోయింది. ... .కన్నవాళ్ళకు బరువు కాకూడదనే ఉద్దేశంతో టైపూ, షార్టుహేండూ నేర్చుకుని ఈ ఉద్యోగంలో చేరింది...ఒంటరితనపు ఉసుర్లతో తుంటరి వాళ్ళ విసుర్లతో అనుక్షణం నరకంలాంటి లోకంలో బండరాయిలా బతకటం నేర్చుకుంది.

సరిగ్గా ఆ సమయంలోనే మారువేషంలో మన్మధునిలా కనిపించిన అతణ్ణి చూసేసరికి తనలో అణగారిపోతున్న తపనలాంటిదేదో ఉవ్వెత్తున పైకి లేచి హృదయాన్ని బరువెక్కించింది.

తిరిగి అతను వెళ్ళిపోయిన తర్వాత మేనేజరు నించి పిలుపొచ్చింది....

నెమ్మదిగా లోపలకు వెళ్ళింది తను...

"సారీ, మిస్ శారదా ! సంజీవిగారికి నిన్ను పరిచయం చేయలేకపోయాను... అన్నట్టు ఆయనెవరో తెలుసా?..... మన ప్రొప్రయిటర్‌గారబ్బాయి....త్వరలోనే స్టేట్స్ వెడుతున్నాడు...." వచ్చివెళ్ళిన వ్యక్తి గురించి అప్పుడు చెప్పాడు మేనేజరు.....

"కాఫీ తీసుకో, మమ్మీ !" అపర్ణ హెచ్చరికతో ఇరవై సంవత్సరాల గతాన్ని మళ్ళీ మనోనేత్రాల వెనుక దాచేసుకుని, వాస్తవానికి వచ్చింది శారద.

"అమ్మా !" కాఫీ సిప్ చేసి తల్లిపక్కనే సోఫాలో కూర్చుంటూ గోముగా పిలిచింది అపర్ణ

ప్రత్యేకించి ఏదైనా అడగవలసి వచ్చినపుడూ, తన అనుమతి కావలసినప్పుడూ అపర్ణ అలాగే పిలుస్తుంది.

కూతురివైపు ఆసక్తిగా చూసింది శారద.

"రేపు సాయంత్రం విశాఖపట్నం వెళ్ళాలి !" తల్లి కళ్ళలోకి భయంగా చూస్తూ చెప్పింది అపర్ణ.

"మీ ప్రొప్రయిటర్ గారి బర్త్‌డే వేడుకలకా ?"

ఆ ప్రశ్న విన్న అపర్ణ క్షణం సేపు బిత్తరపోయింది.

"నీకెలా తెలుసు ?" అడిగింది.

"ఒకప్పుడు నేనూ మీ కంపెనీలో పనిచేసినదాన్నేగా ?" గతంలోకి చూస్తూ చెప్పింది శారద.

"అవునవును...అప్పట్లో ఆయన ప్రతి ఏడూ తన పుట్టినరోజు పండుగ విశాఖలోనే జరుపుకునేవాడట ! స్టేట్స్‌నించి వచ్చాక మళ్ళీ అదే సంప్రదాయాన్ని కంటిన్యూ చేస్తున్నాడట... ఇందాకా చెప్పాడు."

"కానీ, నువ్వు ఆయనతో అలా అంత చనువుగా ప్రవర్తించటం నా కిష్టంలేదు !" తీవ్రంగా ఉన్నాయి శారద మాటలు.

"అంటే...అంటే...నువ్వు నన్ను అనుమానిస్తున్నావా, మమ్మీ ?"

"అనుమానించటం కాదు...లోకానికి భయపడమంటున్నాను !"

"అయితే, నేను విశాఖపట్నం రావటంలేదని మాప్రొప్రయిటర్ గారితో చెప్పేస్తాన్లే !" నిష్ఠూరంగానే అంది అపర్ణ.

శారద కొన్ని క్షణాలు బదులు చెప్పలేదు....ఆ తర్వాత ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా లేచి కూతురికి చెప్పింది-

"వద్దులే !...నీతో నేనూ వస్తాను !"

"వెరీగుడ్...మంచి అయిడియా...మనిద్దరం ఎంచక్కా వైజాగ్‌లో బీచ్‌కి వెళ్ళచ్చు !" ముచ్చటపడింది అపర్ణ....

★ ★ ★

రంగురంగుల దీపతోరణాలతో హొటల్ 'సన్ అండ్ సీ' వెలిగిపోతోంది.

ఎదురుగా ఉన్న సముద్రంలో కెరటాలు ఉత్సాహంతో ఉరకలేస్తున్నాయి.

కాన్ఫరెన్స్ హాల్లో ఒకటే కోలాహలంగా ఉంది... అక్కడికి చేరుకుంటున్న అతిథుల్నీ జరుగుతున్న ఏర్పాట్లనీ చూసిన అపర్ణ ఆశ్చర్యపోయింది....అందరూ ఖరీదైన

మనుషులే !...దాదాపు అక్కడకు చేరిన మగవాళ్ళంతా 'ఫారిన్ డ్రింక్స్' తీసుకుంటూంటే ఆ మగవాళ్ళ తాలూకు ఆడవాళ్ళు మాత్రం 'లిమ్కాలు, మాజాలూ' పుచ్చుకుంటున్నారు.... మరో మూలనించి కొంతమంది హిప్పీకుర్రాళ్ళు పాశ్చాత్య సంగీతాన్ని వినిపిస్తున్నారు.

"మిస్ అపర్ణ !...మాకంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. ఈ రోజునించీ నా పర్సనల్ సెక్రటరీగా అపాయింట్ చేసుకుంటున్నాను..... కాబట్టి ఇప్పుడు మిస్ అపర్ణ నా బర్త్‌డే కేక్ కట్ చేసి ముందుగా హేపీ బర్త్‌డే చెబుతుంది !" అపర్ణ నడుం చుట్టూ చెయ్యివేసి హాల్లో మధ్యగా ఉన్న టేబుల్ దగ్గరకు తీసుకొచ్చి అందరికీ పరిచయం చేశాడు సంజీవరావు.....

"హాయ్....యూ ఆర్ బ్యూటిఫుల్ !" కేక్ కట్ చేసి అందరికీ ఇస్తూంటే, ఎవరో అన్నారు ఆమెకు షేక్‌హ్యాండ్ ఇవ్వబోతూ...

అపర్ణ ఇబ్బందిగానే తన చేతిని కలిపింది.

"మీరు డేన్సరా ?" మరో మహిళామణి అడిగింది వినవస్తున్న పాశ్చాత్య సంగీతానికి అనువుగా హొయలు పోతూ.

కాదని బెదురు కళ్ళతో బదులు చెప్పింది అపర్ణ.

కొంతమంది నవ్వేశారు. ఆ నవ్వెందుకో ఆమెకు అర్థం కాలేదు. అయితే, అందరి కళ్ళూ తననే గుచ్చి గుచ్చి చూస్తున్నాయన్న సంగతి మాత్రం సులువుగానే గుర్తించింది.

అక్కడి వాతావరణం ముందు కొత్తగానూ, సరదాగానూ అనిపించినా, కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆమెకు రోతగానూ, జుగుప్సాకరంగానూ కనిపించింది.

"నేను రూమ్‌కి వెళ్ళిపోతాను సార్.....తలనెప్పిగా ఉంది..." సంజీవికి చెప్పేసి ఆ హాల్లోంచి బయటకు వచ్చేసింది.

ఎదురుగా సముద్రం మీద పరచుకున్న వెన్నెలను చూసేసరికి మళ్ళీ ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లుగా తోచింది. రోడ్డు దాటి సముద్రతీరాన్ని చేరుకుంది. ఒడ్డుకి కొట్టుకుని వస్తున్న కెరటాల్ని చూస్తూ ఇసుక తిన్నెపై అలాగే కూర్చుండిపోయింది చాలాసేపు.

★ ★ ★

రిస్ట్‌వాచ్‌లో టైమ్ చూసుకుంది శారద... పదీ ఇరవై !

'ఇంకా అపర్ణ రాలేదేమిటో ?" అనుకుంది.

'నేనుకూడా పార్టీకి వెళ్ళి ఉండాల్సింది !' అని కూడా అనుకుంది. 'అయినా,

పిలవని పేరంటం నా కెందుకూ ?' అని మనసుకి సర్ది చెప్పుకుంది మళ్ళీ.

ఒక వేళ పార్టీకి వెళ్ళి ఉంటే తాను అందరి కంటా పడేది...అది తనకు ఇష్టంలేదు. అందుకే తను రూమ్‌లోనే ఒంటరిగా ఉండిపోయింది.

అంతకుముందే బోయ్ తెచ్చిపెట్టిన బటర్‌మిల్క్ తాగేసి లైటు ఆఫ్ చేసి పడుకుంది శారద... ఆలోచనలతో అలసిపోయిన మనసును బలవంతాన నిద్రవైపు మళ్ళించటానికి ప్రయత్నిస్తోంది.

ఆదమరచి కునుకు పడుతున్న సమయంలో ఒక్కసారిగా ఓ మత్తైన పరిమళం ఆ గదిలో గుప్పుమంది. ఇటువైపు ఒత్తిగిలి చూసేలోగానే తనమీదకు ఎవరో వాలిపోతూ భుజాలు రెండూ పొదివి పట్టుకుని దగ్గరకు తీసుకోబోతున్నారు.

హడలిపోయింది శారద.

ఒంట్లో ఉన్న శక్తినంతా కూడదీసుకుని బలంగా ఆ వ్యక్తిని తోసేసి స్విచ్ వేసింది.

గది నిండా వెలుతురు వ్యాపించింది.

ఆ వెలుతురులో ఇద్దరూ ఒకరి నొకరు చూసుకున్నారు.

"నువ్వు.." అర్థం కానట్టుగా ఆమె వైపు చూశాడు సంజీవి.

"నేను శారదని! జ్ఞాపకం ఉన్నానా ?"

"శారదా ? ...అంటే .."అయోమయంగా చూస్తూ అస్పష్టంగా అనుకున్నాడు.

"ఇరవై ఏళ్ళ క్రితం మీ కంపెనీలో స్టెనోగా పనిచేసేదాన్ని. మరిచిపోయుంటారు...... అప్పట్లో ఇలాగే ఓసారి మీ బర్త్‌డే పార్టీకి కంపెనీ 'స్టాఫ్' అందరితో నేనూ విశాఖపట్నం వచ్చాను. పార్టీలో మీరు చిత్తుగా తాగి రాత్రివేళ చీకటిలో, ఒళ్ళు తెలియని స్థితిలో నడుస్తూ నా రూమ్ దగ్గర పడిపోయారు... హోటల్‌బాయ్‌సాయంతో మిమ్మల్ని నా రూమ్‌లోకి తీసుకొచ్చాను... ఆ తర్వాత కొంత సేపటికి మీరు స్పృహలోకి వచ్చాక నేనెవరో తెలియకుండానే చీకట్లో నా పొందు కోసం దగ్గర చేరారు. లైటు వేస్తానంటే వద్దని వారించారు. తప్పుడు పనులు చీకట్లోనే చేయాలన్నారు... నేను అనాకారినని చెప్పాను... అంత మత్తులో కూడా- వేడి మీద రుచీ, వయసులో అందం తెలియవంటూ - కవిత్వం చెప్పారు... చాలా? ఇంకా చెప్పమంటారా?"

ఆవేశంగా మాట్లాడుతున్న శారద వైపు నిశ్చేష్టుడై చూస్తూ ఉండిపోయాడు సంజీవి. అతనిలో మత్తంతా దిగిపోయి, శరీరమంతా చెమట పట్టింది.

శారద మళ్ళీ చెప్పసాగింది-

"మీ అవసరం తీర్చుకున్నాక నేను లైటువేశాను. ఆ వెలుతురులో నన్ను చూసి భయపడ్డారు-గుర్తుందా? కానీ, ఒక్క నిజం మీకు చెప్పాలి. నా జీవితంలో నేను పొందలేననుకున్న ఆనందాన్ని ఆ రోజు నాకు మీరు ప్రసాదించారు!.... అందుకే ఆ తర్వాత మీరు నన్ను 'ఛీపొ'మ్మని చీదరించుకున్నా మీ మీద కృతజ్ఞతను పెంచుకున్నాను!"

"షటప్! అసలు ఇక్కడి కెందుకొచ్చావు.. ఎలా వచ్చావు?" ఉద్రేకంతో ఊగిపోతూ అడిగాడు సంజీవి.

"మీరు రమ్మంటే రాలేదు. నాకూతురుతో వచ్చాను" ధైర్యంగా చెప్పింది శారద.

"కూతురా...? అంటే....?"

"అపర్ణ....! అపర్ణ నా కూతురు!"

ఆ మాట వినగానే కళ్ళు తిరిగినట్టనిపించింది సంజీవికి. పాదాల క్రింద నేల రెండుగా చీలిపోయి, తాను అగాధంలోకి జారిపోతున్నట్టు ఫీలయ్యాడు.

నమ్మలేనట్టుగా చూశాడు ఆమె వైపు.

"నమ్మకం కుదరటం లేదా?.... ఇంత అనాకారికి అంతటి అందమైన కూతురు ఎలా పుడుతుందని ఆశ్చర్యపోతున్నారా?... దాని తండ్రి మీరే, సార్!... అందుకే మీ పోలికలన్నీ అది పుణికి పుచ్చుకుంది!"

"నో!....అబద్ధం .... నువ్వేదో కుట్ర పన్నుతున్నావు!" కోపంతో వణికిపోతూ అరిచాడు సంజీవి.

"అలాంటి అవసరం నాకు లేదు, సంజీవిగారూ!... నే నేమిటో నాకు చిన్నతనం నించీ తెలుసు!"... శారద కళ్ళలో కన్నీరు నిలిచింది ఆ మాటలంటూంటే....

మునివేళ్ళతో ఆ కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది మళ్ళీ -

"కుట్రలు చేసీ, కుతంత్రాలు పన్నీ మిమ్మల్ని లోబరచుకోవాలన్న కోరికే ఉంటే అదేదో నేను గర్భవతినన్న నిజం తెలిసినప్పుడే మిమ్మల్ని అల్లరి పెట్టేదాన్ని...! మీ పరువు ప్రతిష్ఠల్ని కోర్టుకీడ్చి నా పరువు నిలబెట్టుకునేదాన్ని.. ఐ నో!.... నా అనాకారితనాన్ని ఆఖరికి కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ కూడా భరించలేరని నాకు తెలుసు..... అలాంటి ఈ దురదృష్టవంతురాలికి మీ వంటి మన్మధుని పొందు లభ్యమైంది!... ఈ జన్మకి తల్లినయ్యే అదృష్టం కలిగింది. ఆ ఆలోచన నీచమే అయినా ఆ విధంగా నాకు దొరికిన తృప్తీ,

మనశ్శాంతీ మరిచిపోలేనివి! అందుకే మళ్ళీ మీ జోలికి రాలేదు. ఉన్న ఊరూ, చేస్తున్న ఉద్యోగం వదిలేసి దూరంగా వెళ్ళిపోయాను. వేరే ఉపాధి వెతుక్కున్నాను. మీ దయవల్ల అపర్ణ పుట్టింది. అపురూపంగా పెంచుకున్నాను. అక్కడి వాళ్లందరికీ నా భర్త మిలిట్రీలో ఉన్నాడని చెప్పుకున్నాను. ఆ తర్వాత అపర్ణ కూడా నాన్న కావాలని మారాం చేసేది... గత్యంతరం లేక 'నాన్న యుద్ధంలో చచ్చిపోయారు, బేబీ' అని అబద్ధం చెప్పాను. ఆ నమ్మకంతోనే అది పెరిగి పెద్దదైంది. అదృష్టవశాత్తూ మళ్ళీ అది కూడా మీ కంపెనీలోనే ఉద్యోగం సంపాదించుకుంది. నేను మాత్రం అప్పట్నించీ ప్రతి ఆడదీ కోరుకునే పసుపు కుంకుమల్నీ - పూలూ గాజుల్నీ మర్చిపోయి 'విడో' లా..." మరి చెప్పలేక, చెప్పేందుకు మాట రాక భోరున ఏడ్చేసింది శారద.

పైటచెంగుతో కళ్ళు తుడుచుకుని ఎదురుగా చూసేసరికి అక్కడ సంజీవి కనిపించలేదు...

★ ★ ★

సీసాలు ఖాళీ అవుతున్నాయి. ..........

సిగరెట్లు తగల బడుతున్నాయి. ................

ఎదురుగా ఉన్న నిలువెత్తు అద్దంలో తన ప్రతిబింబం తనకే అసహ్యంగా, అంతకుమించి భయంకరంగా కనిపిస్తోంది. తన వయసు తనను వెక్కిరిస్తోంది. తూలుతూ వెళ్ళి కర్టెన్ ని పక్కకు తొలగించి కిటికీ లోంచి బయటకు చూశాడు సంజీవి.

సముద్రం మీద పొగమంచు కురుస్తోంది. ఆ మంచుని చీల్చుకుంటూ వెలుతురు వ్యాపిస్తోంది.

సంజీవి ఆలోచనల్లో కూడా ఓ మెరుపు మెరిసింది. ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా లేచి, తడబడే అడుగులతో శారద, అపర్ణలున్న రూమ్ దగ్గరకు చేరుకున్నాడు.

బజర్ నొక్కినా తలుపులు తెరుచుకోలేదు.

అటుగా వెడుతున్న హోటల్ బోయ్ సంజీవిని చూసి ఆగిపోయి చెప్పాడు-

"ఈ రూమ్‌లో లేడీస్ వెళ్లిపోయారు, సార్!"

"వెళ్ళి పోయారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఔను సార్! రాత్రి ఒంటి గంటకే వెళ్ళిపోయారు. నేనే టాక్సీ తీసుకొచ్చాను!" చెప్పాడు బోయ్.

'ఛ...ఛ...! ఎంత ఫూలిష్‌గా బిహేవ్ చేశాను?' తనలో తనే గొణుక్కుంటూ వెనక్కి తిరిగాడు సంజీవి.

★ ★ ★

సూర్యోదయం కాబోతోంది. పెరట్లో దానిమ్మ చెట్టు మీద పిచికలు ఒకటే రొద చేస్తున్నాయి.

అప్పటికే స్నానం చేసి వచ్చిన శారద -గదిలో ఫాను క్రింద సోఫాలో కూర్చుని జుట్టు ఆరబెట్టు కుంటోంది.

రాత్రి నిద్రలేదేమో- వేడి వేడి నీళ్ళతో స్నానం చేసేసరికి కళ్ళు మూతలు పడసాగాయి. అలాగే సోఫాలో వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకుంది...

అంతలో వెచ్చని నీటి బొట్టు నుదుటి మీద పడేసరికి ఉలిక్కిపడి కళ్ళు విప్పి చూసింది.

ఎదురుగా అపర్ణ...!!

ఆమె కళ్ళలో దాగని కన్నీళ్ళు.. ఆమెచేతిలో వెండి కుంకుమ భరిణ!!!

జరగబోయే దేమిటో ఊహించుకునే లోగానే ఆమె నుదుట కుంకుమ పెట్టింది అపర్ణ!

"బేబీ!" ఆశ్చర్యం, ఆనందం, ఆప్యాయతా, ఆవేదనా మొదలయిన ఎన్నో అర్థాలు ఆ పిలుపులో, ఆమె చూపులో ప్రతిధ్వనించాయి.

"మమ్మీ! యూ ఆర్ గ్రేట్, మమ్మీ!" అంటూ గట్టిగా తల్లిని కౌగలించుకుంది అపర్ణ....

ఆమె ఎందు కలా చేసిందో శారద అడగనూ లేదు. అంతకు ముందు రాత్రి తాను బీచ్‌లో కూర్చుని రూమ్‌కి వచ్చినప్పుడు తన తల్లి సంజీవితో చెప్పిన మాటలు తాను విన్నట్టుగా అపర్ణ చెప్పనూ లేదు!

ఆ కౌగిలింతలో ఒకరి హృదయస్పందన మరొకరు వినటానికి ప్రయత్నిస్తూ అలాగే ఉండిపోయారు చాలాసేపు!

అంతే!! ★

(ఆంధ్రప్రభ 12-2-86)